అది చాలా చిన్న చట్టం. పుస్తకంలో రెండు పేజీలు మాత్రమే ఉంటుంది. అందులో 7 సెక్షన్లు మాత్రమే ఉన్నాయి. అధికారం ఇచ్చేవాళ్లకు కొంత అధికారం ఇస్తూ, దానిని భరించేవారికి కొంత రక్షణ కల్పించే చట్టమయితే పెద్దదిగా ఉండాలి, ఎక్కువ సెక్షన్లుండాలి, మినహాయింపులతో షరతులతో సంక్లిష్టంగా ఉండాలిగానీ క్రూరమైన అధికారాన్ని కట్టబెట్టే చట్టం చిన్నగానూ చిన్నపిల్లలకు సహితం అర్థమయ్యేంత సరళంగానూ ఎందుకుండకూడదు?

దాని పేరు సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టం. అది అస్సాం, మణిపూర్‌లలో మాత్రమే ఉందనుకునేరు. 1958లో ఆ చట్టాన్ని చేసినప్పుడు ప్రస్తుత నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, మేఘాలయ, త్రిపురలు 'అస్సాం' అనే రాష్ట్రంలో భాగంగా ఉండేవి. ఈ రాష్ట్రాలు వేరుపడిన తరువాత 1972లో ఆ చట్టాన్ని సవరించి పేరు మార్చకుండానే ఈ రాష్ట్రాలన్నిటికీ వర్తింపజేశారు. తరువాతి కాలంలో జమ్ము-కాశ్మీర్‌కు కూడా అదే నమూనాలో ఒక చట్టం చేశారు.

ఈ చట్టాన్ని రద్దు చేయాలని మణిపూర్‌లో ఈ రోజు విస్తృతమైన ప్రజా ఉద్యమం నడుస్తున్నది. ఇటువంటి ఉద్యమాలూ, ఆందోళనలూ ఈశాన్య భారతంలో చాలా జరిగాయి. వాటిని ఇక్కడి పత్రికలు గానీ, ప్రజలు గానీ ఎన్నడూ పట్టించుకోలేదు. కలకత్తాకు తూర్పున భారత భూభాగమేదీ లేనట్టే తక్కిన దేశం బతుకుతుంటుంది (అయితే ఆ భూభాగం వేరయిపోతానంటే మాత్రం విపరీతంగా ఆవేశపడుతుంటుంది).

కూడా అన్నారు. ఆ మేరకు ఒక 'మెమో' తయారుచేసి దానిపైన మనోరమ సంతకం తీసుకొని ఉంచుకున్నారు. ఇంటివద్ద రాసిన అరెస్టు 'మెమో'లో ఆమె వద్ద నిషిద్ధ వస్తువేదీ దొరకలేదని రాసిన సంగతి, దానిపైన కూడా మనోరమ సంతకం చేసిన సంగతి, పైన చెప్పాము. రెండవ మెమోపైన ఆమె ఏ పరిస్థితిలో సంతకం చేసి ఉంటుందో ఊహించడం కష్టం కాదు.

అరెస్టు చేసినప్పుడు మనోరమ మణిపురీ స్త్రీలు సాధారణంగా ధరించే బిగువయిన లుంగీ వంటి వస్త్రం ధరించి ఉందనీ, రబ్బర్ చెప్పులు వేసుకొని ఉందనీ– ఆమె పొలాల వెంబడి పారిపోయే ప్రయత్నం చేయడమేమిటని ప్రజలు వేసిన ప్రశ్నకు అస్సాం రైఫిల్స్ ఏ జవాబూ ఇవ్వలేదు. ఒకవేళ పారిపోయే ప్రయత్నం చేసినా వెంటపడి పట్టుకోవడం అస్సాం రైఫిల్స్ వీరజవాన్లకు సాధ్యం కాలేదా అన్న ప్రశ్నకూ జవాబివ్వలేదు. ఆమెను అస్సాం రైఫిల్స్ జవాన్లు రేప్‌చేసి చంపారని మణిపూర్ ప్రజల అభియోగం. ఆమె శరీరం మీద ఉన్న గాయాలను బట్టి వారు ఆ నిర్ధారణకు వచ్చారు.

అయితే మణిపూర్ ప్రజలు ప్రశ్నలడుగుతూ కూర్చోలేదు. మణిపూర్ రాష్ట్రం మైదాన ప్రాంతంలోని ప్రధాన తెగ అయిన మీయ్‌తీల పౌర సమాజంలో మొదటి నుండి స్త్రీలదే చురుకయిన పాత్ర. మహిళా సామాజిక కార్యకర్తలను 'మీయ్‌రా పైబీ'లు అంటారు. 11 మంది మీయ్‌రాపైబీలు జూలై 15న అసాధారణమైన నిరసన చేపట్టి విస్తృతమైన నిరసన ఉద్యమానికి నాంది పలికారు. ఆనాటి నుండి ఈనాటి వరకు మణిపూర్‌లో సాధారణ స్థితి తిరిగి రాలేదు.

## మణిపూర్ ఆందోళన:

# సైనిక చట్టమే కాదు పాలనా పోవాలి




ఈసారి మరి దేశమంతా పట్టించుకోవడానికి కారణం 11 మంది మణిపురీ స్త్రీలు తీసుకున్న సాహసవంతమైన నిర్ణయం. జులై 15న వాళ్లు మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని అస్సాం రైఫిల్స్ (ఒక పారా మిలిటరీ బలగం) కేంద్రం ఎదుట 'భారత సైనికులారా మమ్మల్నీ రేప్ చేయండి' అని బ్యానర్ పట్టుకొని నగ్న ప్రదర్శన నిర్వహించారు. మగవాళ్లు అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం దేశం చూసింది గానీ స్త్రీలు నగ్న ప్రదర్శన చేయడం చూడలేదు, ఎన్నడూ ఊహించలేదు. చెప్పుతో చెంపమీద కొట్టినట్టు దేశం లేచి కూర్చుంది. మణిపూర్‌లో ఏం జరుగుతున్నది? అని అడగసాగింది.

అంతకు ముందు ఒక ఘటన జరిగింది. జూలై 10 రాత్రి తంగ్‌జాం మనోరమాదేవి అనే 32 సంవత్సరాల స్త్రీని అస్సాం రైఫిల్స్ జవాన్లు ఇంఫాల్‌లోని ఆమె యింటి నుండి నిద్రలేపి బాగా కొట్టి తీసుకుపోయారు. చాలా చట్టబద్ధంగా అరెస్టు మెమో రాసి ఆమె సంతకం కూడా తీసుకొని ఆమె తలిదండ్రులకు ఇచ్చారు. ఆమె వద్ద నిషిద్ధ సామగ్రి ఏమీ దొరకలేదని అందులో రాశారు కూడా.

మరుసటిరోజు తెల్లవారి పట్టణం బయట చేలలో మనోరమ శవం దొరికింది. శవంలో ఎనిమిది తూటాలు దిగి ఉన్నాయి. ఇంటరాగేషన్ చేస్తుండగా ఆమె తప్పించుకొని పారిపోబోయిందనీ, అప్పుడు కాల్చామనీ అస్సాం రైఫిల్స్ అధికారులు అన్నారు. వారి పరిశోధనలో ఆమె పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అనే వేర్పాటువాద సంస్థ కార్యకర్త అని తేలిందన్నారు. ఆమె ఇంట్లో సింగపూర్‌లో తయారైన రేడియో సెట్ ఒకటి, చైనాలో తయారైన గ్రెనేడ్ ఒకటి దొరికాయని

సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఉపసంహరించాలన్నది వారి డిమాండు. ఆ చట్టం పోతే అణచివేత పోతుందని నమ్మేంత అమాయకులు కారు వారు. నిర్బంధ చట్టాలు నిర్బంధానికొక వికృతమైన 'చట్టబద్ధత' మాత్రమే కల్పిస్తాయి. అవి నిర్బంధానికి కారణం కాదు, నిర్బంధ చట్టాలు లేకపోతే నిర్బంధం లేకుండ పోదు. మణిపూర్‌తో సహా ఈశాన్య భారత ప్రాంత ప్రజలంతా కోరుకునేది సైనిక పాలన పోవాలని. దానికి చట్టబద్ధత కల్పించే ఈ చట్టం సైనిక పాలనకొక సంకేతం మాత్రమే.

విచ్చలవిడి బలప్రయోగాన్ని ఆమోదించడం ఈ చట్టం లక్ష్యం. ఒక వ్యక్తి నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తున్నట్టయితే అతనిని నివారించడానికి తుపాకీతో నయినా, వేరే ఏ రకంగానైనా– ప్రాణం తీసేంత బలప్రయోగమయినా సరే– సైనికులు చేయవచ్చునని ఈ చట్టంలోని సెక్షన్ 4(ఎ) అంటుంది. సాయుధ దాడులు చేయడానికి, లేక ఆయుధాలు దాచుకోవడానికి, లేక మిలిటెంట్లకు తర్ఫీదు ఇవ్వడానికి ఉపయోగపడుతుందని భావించే ఏ నిర్మాణాన్నయినా సైనికులు పూర్తిగా ధ్వంసం చేయవచ్చునని 4(బి) అంటుంది. ఒక నేరం చేసిన, లేక చేయబోతున్న వ్యక్తిని అరెస్టు చేయడానికి సైనికులు ఎంత అవసరమనుకుంటే అంత బలప్రయోగం చేయవచ్చునని సెక్షన్ 4(సి) అంటుంది. ఏ నివాసాన్నయినా వ్యక్తుల కోసం, వస్తువుల కోసం వారంట్ కూడా లేకుండ సైనికులు సోదాచేయవచ్చుననీ ఆ క్రమంలో ఎంత అవసరమనుకుంటే అంత బలప్రయోగం చేయవచ్చునని సెక్షన్ 4(డి) అంటుంది.

# మరొక స్త్రీ సాహసం

ఈరోజు మణిపూర్ రాష్ట్ర ప్రజలంతా రోడ్డెక్కేసరికి వారి ఆందోళన బయటి ప్రపంచం దృష్టిని ఆకర్షించిందిగానీ, నాలుగు సంవత్సరాలుగా ఒక స్త్రీ ఇదే డిమాండుతో ఆమరణదీక్ష చేస్తున్నది. కవి, మానవహక్కుల కార్యకర్త అయిన ఇరోం షర్మీలా సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దుచేయాలంటూ 2000 సంవత్సరం నవంబర్ 2న ఆమరణ దీక్షకు కూర్చునింది. ప్రభుత్వం ఆదేశం మేరకు డాక్టర్లు రబ్బర్ గొట్టాల ద్వారా ఎక్కిస్తున్న 'ఆహారం' తప్ప ఆమె ఏమీ తీసుకోవడం లేదు. పూర్తిగా శుష్కించి ఎముకలూ చర్మం తప్ప ఏమీ మిగలకుండా పోయినా షర్మీ తన పట్టుదల వీడడం లేదు. మానవహక్కుల ఉద్యమకారులు, శ్రేయోభిలాషులు ఆమె చేత ఈ దీక్ష విరమింపజేయాలని ప్రయత్నిస్తే మీరు నాచేత మాన్పిస్తారుగానీ చట్టాన్ని రద్దుచేయించలేరు కదా అని తిరస్కరిస్తుంది.

ఈ అధికారాలు చలాయించే క్రమంలో సైనికులు పాల్పడే ఏ చర్య మీద నయినా కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ఎటువంటి కేసూ పెట్టడానికి వీలులేదని సెక్షన్ 6 అంటుంది.

మామూలు చట్టాలు పోలీసులకు బలప్రయోగం చేసే అధికారం ఇచ్చిన చోట 'కనీస బలప్రయోగం' మాత్రమే చేయాలని నొక్కి చెప్తాయి. ఈ చట్టం 'నీకు అవసరమనిపించినంత చేసుకో' అంటుంది. అందుకే ఇటువంటి చట్టాలను అణచివేత చట్టాలు, నిర్బంధ చట్టాలు అంటాం.

దాదాపు 50 ఏళ్లగా ఈశాన్య రాష్ట్రాలను ఏలుతున్న సైనిక పాలన తొలగి పోవాలని కోరుకునే ఆ ప్రాంత ప్రజలు ఈ చట్టాన్ని రద్దుచేయాలన్న డిమాండును తమ ఆందోళనకు కేంద్రం చేసుకోవడం సహజం. ఈ ఆందోళనను అండర్ గ్రౌండ్ మిలిటెంట్ సంస్థలు రెచ్చగొడుతున్నాయని ఎప్పటిలాగే భారత సైన్యం ఆరోపిస్తున్నది. కానీ నిజానికి చేతిలో తుపాకి పట్టుకొని ప్రభుత్వంపైన యుద్ధం చేస్తున్న వారికి ఇటువంటి చట్టాల వల్ల ప్రత్యేకంగా వచ్చే సమస్య ఏమీ లేదు. వాటి క్రూరత్వాన్ని అనుభవించేది ఆ మిలిటెంట్ సంస్థల పట్ల రాజకీయంగా, సామాజికంగా ఎంతో కొంత సంబంధాలు, సానుభూతి ఉండే మామూలు జనమే. ఈశాన్య భారత రాష్ట్రాలలో నడుస్తున్న పోరాటాలన్నీ అక్కడి వివిధ ప్రజా సమూహాలు తమ జాతి ఉనికినీ స్వాతంత్ర్యాన్నీ కాపాడుకోవడానికి చేస్తున్న పోరాటాలు కాబట్టి ఆయా జాతులకు చెందిన ప్రజలకు ఆ పోరాటాల పట్ల ఎంతో కొంత సానుభూతి, సంబంధాలు ఉండడం సహజం. అందువల్ల ఆ ప్రజానీకమంతా ఇటువంటి చట్టాల క్రూరత్వానికి బలికావడం, వాటి రద్దును కోరుకోవడం సహజం. ఈ రోజు మణిపూర్ గురించి వింటున్నాంగానీ ఇదే స్థితి మిజోరంలో, త్రిపురలో, అస్సాంలో, నాగాలాండ్‌లో 50 ఏళ్లుగా ఉంది. నాగా లాండ్‌లో ప్రస్తుతం ప్రభుత్వానికీ మిలిటెంట్లకూ మధ్య కాల్పుల విరమణ అమలులో ఉందిగానీ లేకుంటే అక్కడి అన్ని రాష్ట్రాలకంటె నాగాలాండ్ ఎక్కువ నిర్బంధాన్ని చవిచూసింది.

అందువల్ల మణిపూర్ ప్రజల పోరాటానికి మనందరి మద్దతూ అవసరం. ప్రజలు ఒక్కసారి ఉవ్వెత్తున లేచేసరికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇబోబిసింగ్ కాంగ్రెస్ సంస్కృతికి సహజమైన సర్దుబాటు ధోరణిలో ఒక్క ఇంఫాల్ పట్టణంలో చట్టం అమలును ఉపసంహరించాడు. అంటే ఇంఫాల్‌లో పట్టుకున్న వారిని బయటికి తీసుకుపోయి కాల్చేస్తే సరిపోతుందన్న మాట!

తంగ్‌జాం మనోరమాదేవి హత్యపైన రెండు మూడు విచారణలు మొదల య్యాయి. అయితే విచారణలు రహస్యంగా ('ఇన్ కెమెరా') జరగాలనీ విచారణాధికారి తమ కేంద్ర కార్యాలయానికే వచ్చి తమను ప్రశ్నించాలనీ అట్లాగయితేనే తాము విచారణలో పాల్గొంటామనీ అస్సాం రైఫిల్స్ అధికారులు అంటున్నారు. వాళ్లను 'నఖ్రాలు' చేయొద్దని శాసించే ఉద్దేశ్యం భారత సర్కార్‌కు లేదు. ఆ రాష్ట్రంలోని ప్రజలంతా తీవ్ర ఆవేదనకు గురయినా ఫరవాలేదు, భారత్‌ను మరింత ద్వేషించినా ఫరవాలేదు, నేరం చేసిన సైనికులను కాపాడడమే ప్రధానం భారత సర్కార్‌కు. ఇంఫాల్ పట్టణంలో మాత్రమే ఆ నిర్బంధ చట్టం అమలును నిలుపుదల చేయడం హాస్యాస్పదమని సాధారణ మానవులకు అనిపిస్తుండగా, ఆ మాత్రం స్వతంత్రించినందుకు ఇబోబీసింగ్‌పైన కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్ కన్నెర్ర చేశాడంట. 'మా పార్టీ వాడయితేనేం? మాకు చాలా కోపంగా ఉంది' అని విలేకర్లతో అన్నాడంట.

శివరాజ్ పాటిల్ కన్నెర్ర చేస్తే చేయవచ్చునుగానీ మణిపూర్ ప్రజల భావాలను పట్టించుకోకుండ ఉండడానికి ఇబోబీసింగ్ బయటివాడు కాదు కదా. రాజీ రాజకీయాల పరిధిలోనయినా ఏదో ఒకటి చేయక తప్పదు. అయితే అతను చేసింది చాలదు. సైనికుల చేతిలో విధ్వంసక అధికారాలు పెట్టే ఆ చట్టాన్ని మొత్తంగా ఎత్తివేయాలి. అంతేకాదు, ఈశాన్య భారతంలో సైనిక పాలనను ఎత్తివేయాలి.

# మణిపూర్ ప్రజలకు ఏం కావాలి?

మణిపూర్‌లో రకరకాల పేర్లతో పనిచేస్తున్న 32 సాయుధ పోరాట సంస్థలున్నాయని అంచనా.

మణిపూర్‌కు ఒక స్వతంత్ర రాజ్యంగా కనీసం వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉందని ఈ పోరాటాలలో ప్రధాన పాత్ర వహిస్తున్న మీయ్‌తీ జాతి ప్రజల భావన. వారి రాజ్యాన్ని మొగల్ పాదుషాలు సహితం జయించలేదు. 1891లో బ్రిటిష్‌వాళ్లు వారి రాజును లోబరచుకొని సామంతుడిని చేసుకోవడం వారి ప్రథమ పరాజయం. బ్రిటిష్ వాళ్లతో పోయిన స్వాతంత్ర్యం బ్రిటిష్ వాళ్ల నిష్క్రమణతో తిరిగి వచ్చిందని, భారత పాలకుల నిర్బంధ విధానాల వల్లనే అది తమకు దక్కకుండ పోయిందనీ వారి ఫిర్యాదు.

ఇది క్రిష్టియన్ మిషనరీల కుట్ర అనడానికి నాగాలలాగ వీరు క్రిష్టియన్లు కారు. ఐఎస్ఐ కుట్ర అనడానికి కాశ్మీరీలలాగ ముస్లింలు కారు. మీయ్‌తీలు హిందువులు. వైష్ణవ మతావలంబులు. అయితే వారి భాష, జీవన సంస్కృతి, రూపురేఖలు భారతీయుల కంటె చాలా భిన్న మయినవి. వెయ్యి సంవత్సరాల అవిచ్ఛిన్నమయిన తమ స్వతంత్ర అస్తిత్వం వదులుకోవడం వారికి ఇష్టంలేదు.

1947లో వారి రాజు బోధాచంద్ర సింగ్ భారత్ ఒత్తిడి ఫలితంగా కేంద్ర ప్రభుత్వానికి రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార సాధనాలు అనే మూడు విషయాలలో మాత్రం అధికారం ఉండే షరతు మీద మణిపూర్‌ను భారత్‌లో విలీనం చేశాడు. అయితే రెండేళ్లు తిరగకముందే నెహ్రూ – పటేళ్ల ప్రభుత్వం అతని మీద బాగా ఒత్తిడి పెట్టి పూర్తిగా విలీనం చేసేసుకున్నారు. అది కుట్ర అని ప్రజల అభియోగం.

**23 ఆగస్టు, 2004**

హైదరాబాద్

మానవహక్కుల వేదిక

**Human Rights Forum**